సాక్షి
ఖమ్మం
శనివారం | 13 | ఏప్రిల్ | 2024



ఎక్కడికక్కడే ఎన్నికల సామగ్రి

లోక్‌సభ ఎన్నికల సామగ్రి గతంలో ఒకే చోట పంపిణీ చేయగా.. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అందిస్తున్నారు. 10లో



...రుణాలకు ఆదరణ కరువు

పంటలను తాకట్టు పెట్టుకుని అందించే రుణాలపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో వారు లబ్ధి పొందలేకపోతున్నారు. 12లో



వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ ప్రభావం అంతగా ఉండకపోగా, రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి వైభవంగా పంచామృతాభిషేకం

- జమలాపురంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శ్రీవారి పాదానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం శ్రీవారికి అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం పరమ పవిత్రమైన శ్రీస్వామి వారి పాదాలకు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామి వారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఆ తర్వాత అర్చకులు శాస్త్రోక్తంగా కలశ పూజ చేశారు. శ్రీఅలివేలు మంగ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. శ్రీ పద్మావతి, శ్రీ అలివేలుమంగ సమేతుడైన స్వామివారిని గజ వాహనంపై ఊరేగించగా, భక్తులు, గ్రామస్తులు కోలాటాలతో గిరి ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు విజయదేవ శర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాలను సందర్శించిన దేవనాద జీయర్ స్వామి

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతా రామచంద్ర స్వామివారిని శ్రీశ్రీశ్రీ దేవనాద రామానుజ జీయర్ స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి అనిల్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దుమ్ముగూడెంలోని శ్రీఆత్మ రామచంద్ర స్వామివారి ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు.


పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: శ్రీదేవి వసంత నవరాత్రోత్సవల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం పెద్దమ్మతల్లికి అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు 108 కలశాలతో పంచామృతాభిషేకం, నాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, సూక్తపారాయణం, చండీ సప్తసతీ పారాయణం, హోమాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

పోరుకు కౌంట్‌డౌన్..

ఎన్నికల కురుక్షేత్రంలో తలపడేందుకు రాజకీయ పార్టీలు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. ఈనెల 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచి ఈనెల 25 వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక బీఆర్‌ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా.. వారు ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ అధిష్టానం నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం ఇక ప్రచారం ఊపందుకోనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఈనెల 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్

- ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు
- వ్యూహాలకు పదును పెడుతున్న పార్టీలు
- ప్రచారం ప్రారంభించిన బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు
- నేడో, రేపో కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన

అభ్యర్థి ప్రకటన ఆలస్యంతో..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అయితే ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం.. పలువురు నేతలు టికెట్ కోసం పట్టుబట్టుతుండడంతో అభ్యర్థి ఎంపిక అంతకంతకూ ఆలస్యం అవుతోంది. నోటిఫికేషన్ విడుదలకు మరో ఐదు రోజులు మాత్రమే సమయం ఉండగా రెండు రోజుల్లో అభ్యర్థిని ఫైనల్ చేయాలనే ఆలోచనలో ఆ పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అభ్యర్థి ప్రకటన అనంతరం ప్రచారంలో దూసుకుపోయేలా నాయకత్వం వ్యూహరచన చేస్తోంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. అభ్యర్థి గెలుపు కోసం ఆయనతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అధిష్టానం బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. మంత్రి పొంగులేటి ఇప్పటికే కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయగా.. అభ్యర్థి ప్రకటన అనంతరం ప్రచారం, పోలింగ్ తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. అలాగే పార్టీ అగ్రనేతలతో ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

సభలు, సమావేశాలతో బీఆర్‌ఎస్..

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముందుగానే ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావును ప్రకటించారు. దీంతో ఆయనతో పాటు పార్టీ నేతలు ప్రచార బాట పట్టారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు నామతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపీ నామ నేతలతో కలిసి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ తన గెలుపు కోసం పనిచేయాలని కార్యకర్తలను, నాయకులను కోరుతున్నారు. ప్రచారం నిమిత్తం వాహనాలను, పోస్టర్లను, జెండాలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భారీ బహిరంగ సభ, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే ఒక్కో నేత ఒక్కో నియోజకవర్గ బాధ్యతలు తీసుకుని ఓటర్లను కలవాలని ఇప్పటికే నిర్ణయించినట్లు తెలిసింది.

మోదీ చరిష్మాతో..


కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు దీటుగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల బరిలో దిగుతోంది. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ప్రకటించింది. ఆ పార్టీ వ్యూహాత్మకంగా అభ్యర్థిని ప్రకటించడంతోపాటు ప్రచారంలో దూసుకెళ్తోంది. ఇప్పటికే కేంద్ర మంత్రులు పలుమార్లు ఈ లోక్‌సభ పరిధిలో పర్యటించి బీజేపీని గెలిపించాలని ప్రచారం చేశారు. ఇటీవల విజయ సంకల్ప యాత్ర పేరుతో బీజేపీ కేంద్ర మంత్రులు, నేతలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలను చుట్టారు. మోదీ నాయకత్వంలో దేశం సాధించిన ప్రగతి, జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఈ యాత్రలు సాగాయి. అలాగే బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఆయన స్వయంగా పర్యటించడంతో పాటు ప్రచార రథాలు, గోడలపై రాతలతో ముందున్నారు. ఈ ఎన్నికల్లో సత్తా చాటాలనే ఉద్దేశంతో ఆ పార్టీ బలంగా పనిచేస్తోంది. నోటిఫికేషన్ అనంతరం ప్రచారం ముగిసేలోగా పార్టీ అగ్రనేతలతో నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహణకు పార్టీ నేతలతోపాటు అభ్యర్థి వినోద్‌రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్నికలకు విస్తృతంగా ఏర్పాట్లు..

మరోవైపు ఎన్నికలను పటిష్టంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఎంపిక పూర్తయింది. మొత్తం 1,083 ప్రాంతాల్లో 1,896 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి.గౌతమ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఖమ్మం లోక్‌సభ పరిధిలో 16,23,814 మంది ఓటర్లున్నారు. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 3న ఓటు హక్కుపై అవగాహన పెంచేందుకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు 5కే రన్ నిర్వహించారు. కాగా, ఈనెల 25న తుది ఓటరు జాబితా వెలువడనుంది.

గృహజ్యోతి.. రూ.6.69కోట్లు

- జిల్లాలో 2.36 లక్షల కనెక్షన్లకు ఉచిత విద్యుత్
- ఎన్నికల కోడ్‌తో సవరణలకు బ్రేక్
- 200 యూనిట్లు దాటితే బిల్లు కట్టాల్సిందే..
- మరుసటి నెల తగ్గితే 'జీరో' బిల్లు



	Date	Sts	Reading
Present KWH	02/03/24	01	5778
Previous KWH	04/02/24	01	5682
KWH Units: 96		Days:	27
Average Month Units:			103.11
Recorded MD			0.00 KW
Energy Charges			329.20
Fixed Charges			10.00
Customer Charges			90.00
Electricity Duty			5.76
Interest on ED			0.04
Surcharge			25.00
ACD Surcharge			0.0
FSA/FCA Charges			0.0
Adjustment			0.00
Interest on CD			0.00
Loss/Gain			0.00
Bill Amount			460.00
Gruha Jyothi Subsidy			-460.0
Net Bill Amount			0.00

గృహజ్యోతి కింద జారీ చేసిన జీరో బిల్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో గృహజ్యోతి పథకం కింద నెలకు రూ.6.69 కోట్ల విలువైన విద్యుత్‌ను వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు సంస్థ గుర్తించింది. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి వచ్చాక 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేస్తోంది. తెల్ల రేషన్ కార్డు ఉండి, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో అనుసంధానమైన విద్యుత్ కనెక్షన్లకు ఉచిత పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 4,27,171 ఉండగా.. ఇందులో 3,55,905 కనెక్షన్ల వినియోగదారులు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఎన్పీడీసీఎల్ ద్వారా సర్వే చేయించగా.. అర్హులైన వినియోగదారుల రేషన్ కార్డులు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను విద్యుత్ కనెక్షన్‌కు అనుసంధానం చేశారు. ఆపై నెలకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగించే సర్వీసులకు గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేశారు.

ఫిబ్రవరి నుంచి ప్రారంభం..

ఫిబ్రవరి నుంచి అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద 2,36,166 విద్యుత్ సర్వీసులను గుర్తించారు. వీటికి అదేనెల 2వ తేదీ నుంచి 'జీరో' బిల్లులను జారీ చేయడం ప్రారంభించారు. ఈ మొత్తం సర్వీసులు ఫిబ్రవరిలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించగా.. దాని విలువ రూ.6.69 కోట్లుగా తేలింది. ఈ నిధులను ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, ప్రభుత్వం పథకం అమలుకు ముందుగానే రూ.200 కోట్లు కేటాయించగా.. ఏ నెలకానెల వినియోగించే గృహజ్యోతి పథకం కనెక్షన్ల బిల్లులను ప్రభుత్వం సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది.

సవరణలకు విరామం..

గృహజ్యోతి పథకంలో అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుండగానే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి నుంచి గృహజ్యోతి పథకం అమలవుతున్నా.. పలువురు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవటం, సమర్పించినా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవటంతో వారికి పథకం వర్తించడం లేదు. దీంతో మార్చి ఆరంభంలో ప్రభుత్వం మరోమారు దరఖాస్తుల స్వీకరణకు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇంతలోనే ఎన్నికల కోడ్ రాగా.. ప్రక్రియ నిలిచిపోయింది. ముందుగానే గుర్తించిన అర్హులైన వారి కనెక్షన్లకు మార్చిలో కూడా జీరో బిల్లులు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత తిరిగి గృహజ్యోతికి దరఖాస్తుల స్వీకరణ, వర్తింపు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంది.

ఆందోళన వద్దు..

తెల్ల రేషన్ కార్డు కలిగి, నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి వర్తించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ఫిబ్రవరి నుంచి అమలవుతుండగా.. ప్రస్తుతం వేసవి కావడంతో ఉక్కపోత నుంచి రక్షించుకునేందుకు ప్రతీ ఇంట్లో ఫ్యాన్లు, కూలర్ల వినియోగం తప్పనిసరైంది. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతుండగా మార్చిలో జీరో బిల్లు వచ్చిన వారికి ఈనెల 200 యూనిట్లు దాటడంతో అలా రాలేదు. ఈ విషయమై లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యాన అధికారులు స్పష్టత ఇచ్చారు. ఏదైనా కారణాలతో 200 యూనిట్లు దాటితే బిల్లు వస్తుందని, ఆ మరుసటి నెల వినియోగం తగ్గితే జీరో బిల్లే వస్తుందని పేర్కొన్నారు. అంతే తప్ప ఒక నెల వినియోగం పెరిగినంత మాత్రాన పూర్తిగా తొలగించాలనే నిబంధన ఏదీ లేదని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేటలో జరిగే శ్రీశ్రీ లింగా బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొంటారని, 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొత్తగూడెం విద్యానగర్ క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

కిక్కిరిసిన పెద్దాస్పత్రి



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి శుక్రవారం కిక్కిరిసింది. వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారు భారీగా రావడంతో ఓపీ విభాగం రద్దీగా మారింది. క్యూలైన్లన్నీ పేషెంట్లు, వారి బంధువులతో నిండిపోయాయి. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా రద్దీ తగ్గలేదు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

సకాలంలో సీఎంఆర్ ఇవ్వండి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మాట్లాడుతున్న మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్ : జిల్లాలోని మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను సకాలంలో ఎఫ్‌సీఐకి అందించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంలోని సత్యనారాయణ సిల్కీ రైస్ మిల్లు, కూసుమంచి మండలంలోని దక్షిణామూర్తి రైస్‌మిల్లు, నేలకొండపల్లి మండలంలోని సహస్ర ట్రేడర్స్, ముదిగొండ మండలంలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ధాన్యాన్ని మర ఆడించి సకాలంలో ఎఫ్‌సీఐకి అందించాలని ఆదేశించారు.

వైద్య కళాశాల నిర్మాణ ప్రతినిధులతో తుమ్మల భేటీ



ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం వైద్య కళాశాల నిర్మాణ కాంట్రాక్టర్, బిల్డింగ్ డిజైన్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సమావేశమయ్యారు. ప్రతినిధులు చూపించిన డిజైన్ బాగుందని అన్నారు. తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్లు, సిబ్బంది క్వార్టర్లు ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందనే విషయమై కళాశాల సూపరింటెండెంట్, అధ్యాపకుతో చర్చించాలని సూచించారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని చెప్పారు. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి వైద్య కళాశాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గతంలో మట్టి కోసం గుంతలు చేసిన వారితో తిరిగి పూడ్చించి, చదును చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

రామా కనవేమిరా!

- సామాన్య భక్తులకు తప్పని వసతి కష్టాలు
- డార్మిటరీ నిర్మాణాలపై దృష్టి పెట్టని దేవస్థానం
- 'హోం స్టే' విధానంపై కనీస ప్రచారం కరువు
- 24 గంటల్లోపే బుక్కయిన ఏసీ రూములు
- ఈ నెల 17న శ్రీరామనవమి, 18న పట్టాభిషేకం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూద్దామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భద్రాచలంలో వసతి, సౌకర్యాలకు నోచుకోవడంలేదు. అధికారులు దశాబ్దాలుగా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు తప్ప సామాన్య భక్తులను పట్టించుకోవడంలేదు.

ఒక్కరోజులోనే ఏసీ గదులు బుకింగ్..

రామయ్య దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు దేవస్థానానికి చెందిన సత్రాలు, కాటేజీలతోపాటు ప్రైవేటు లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో గదులను బుక్ చేసుకునేందుకు దేవస్థానం ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించింది. ఈ నెల 17,18 తేదీల్లో కల్యాణం, పట్టాభిషేకం ఉండగా, 11 నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇలా బుకింగ్స్ మొదలయ్యాయో లేదో ఇటు దేవస్థానం, అటు ప్రైవేటు లాడ్జీల్లో ఉన్న ఏసీ గదులన్నీ బుక్ అయిపోయాయి. సింగిల్ రూమ్ మొదలు సూట్ వరకు ఏ ఒక్కటీ అందుబాటులో లేవు. వేసవిలో భద్రాచలంలో నలభై డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయి. దీంతో ఏసీ రూమ్‌లకు ఫుల్ డిమాండ్ ఉంది.



నాన్ ఏసీలదీ అదే బాట

నాన్ ఏసీ గదులకు సంబంధించి దేవస్థానం ఆధ్వర్యంలోని కుటీరాలు, సత్రాల్లోని గదులు కూడా ప్రస్తుతం అందుబాటులో లేవు. కేవలం ప్రైవేటు లాడ్జీల్లో నాన్ ఏసీ గదులే అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా ఈ నెల 16 సాయంత్రం 6 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజుల ప్యాకేజీతో లభిస్తున్నాయి. ఇవి సింగిల్ రూమ్‌కి రూ.1,732 మొదలు ట్రిపుల్ రూమ్‌కు రూ.3,464 వరకు చార్జీలుగా ఉన్నాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ఇంత ధర చెల్లించేందుకు కూడా భక్తులు పోటీ పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం నాటికి ఈ గదులు కూడా దొరికే పరిస్థితి కనిపించడం లేదు. భద్రాచలంలో ఉన్న గదులన్నీ ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ అయిపోతే నవమి రోజు ఇక్కడికి చేరుకునే సామాన్య భక్తులు, అడ్వాన్స్ రిజర్వ్ చేసుకోని వారికి ఇక్కట్లు తప్పేలా లేవు.

డార్మిటరీలు కరువే

నవమి వేడుకలు చూసేందుకు యాభై వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. ఇలా వచ్చే భక్తుల్లో సగం మంది ఉదయమే (ఏప్రిల్ 17) భద్రాచలం చేరుకుని కల్యాణం చూసుకుని, దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అవుతారు. ఇలాంటి వారికి వసతితో పెద్దగా అవసరం పడదు. కానీ స్నానాలు చేసేందుకు, సామన్లు దాచుకునేందుకు అనువుగా నామమాత్రపు సౌకర్యాలను ఈ భక్తులు ఆశిస్తారు. ప్రస్తుతం భద్రాచలంలో ఈ సదుపాయాలు కూడా కరువయ్యాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తులకు గోదావరి నదినే స్నానాలకు దిక్కవుతోంది. తమతో పాటు తెచ్చుకున్న లగేజీని దాచుకోవడం కష్టంగా మారుతోంది. బొమ్మలు, కొబ్బరికాయల దుకాణాలే క్లోక్‌రూమ్ సేవలు అందిస్తున్నాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రాచలంలో ఎప్పుడో దశాబ్దాల కిందట కట్టిన సత్రాలు, ప్రైవేటు లాడ్జీలే ఆశ్రయం కల్పిస్తున్నాయి. గడిచిన పదేళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానం సత్రంలో 32 గదులు, జానకీ సదనంలో 32 గదులు తప్ప మరో నిర్మాణం జరగలేదు. మరోవైపు ప్రైవేటు సెక్టారులో ఒకటి రెండు హోటళ్లు, కుల సంఘాల ఆధ్వర్యంలో సత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

హోం స్టే పద్ధతి అమల్లోకి తెస్తే..

మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా భద్రాచలంలో మౌలిక సదుపాయలు మెరుగుపరచడంపై దేవస్థానం, ప్రభుత్వం, భద్రాచలం పంచాయతీలు ప్రయత్నించడం లేదు. ఫలితంగా శ్రీరామనవమి, ముక్కోటి, ఇతర పర్వదినాలు, సెలవు రోజుల్లో భద్రాచలం వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాతల ద్వారా నిధులు సమీకరించి కొత్తగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టడం లేదు. ఇతర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో ఉన్నట్టుగా 'హోం స్టే' పద్ధతిని భద్రాచలంలో అమల్లోకి తీసుకురావడంపై కనీస స్థాయిలో కూడా ప్రయత్నాలు జరగడం లేదు. భద్రాచలంలో ఉన్న స్థానికులకు హోం స్టే విధానంపై అవగాహన కలిగిస్తే పైసా ఖర్చు లేకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడం సాధ్యం అవుతుంది. కానీ ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఎంత సేపు అరకొర సౌకర్యాల నడుమ ఉన్న మిథిలా స్టేడియంలో చలువ పందిళ్లు వేయడం, సెక్టార్లుగా విభజించి టిక్కెట్ల అమ్మకాలు సాగించడంపైనే దృష్టి పెడుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు చివరికి భద్రాద్రిలో తమ ఇబ్బందులు తీర్చాలంటూ ఆ రామయ్యకే మొర పెట్టుకుని వెళ్లిపోతున్నారు.

గోవింద్రాలలో గోవింద నామస్మరణ

- తిరుమలకు బయలుదేరిన 200 కుటుంబాలు



దైవ దర్శనానికి తరలివెళ్తున్న గోవింద్రాల గ్రామస్తులు

కామేపల్లి : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 200 కుటుంబాలకు చెందిన 700 మంది గిరిజనులు కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి బయలుదేరారు. దీంతో మండలంలోని గోవింద్రాల గ్రామంలో గోవింద నామస్మరణ మార్మోగింది. సకాలంలో వర్షాలు కురవాలని, పాడి, పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండేలా దేవుడు కరుణించాలని కోరుకుంటూ వారంతా కలిసి తిరుమల వెళ్లి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో వ్యవసాయ పనులు పూర్తి కావడంతో శుక్రవారం అందరూ కలిసి తిరుపతికి పయనమయ్యారు. కాగా, నెల క్రితమే రైలు టికెట్లు బుక్ చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి భక్తులకు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఏపూరి మహేందర్‌కుమార్, నల్లమోతు లక్ష్మయ్య, మాలోత్ భావ్‌సింగ్, బొడ్డు లక్ష్మీనారాయణ, రెడబోతు గోపిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ విరమణ వయసుపై స్పష్టత ఇవ్వాలి

ఖమ్మంవైద్యవిభాగం: రిటైర్మెంట్ వయస్సుపై వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ఆయుష్ ఫార్మసిస్ట్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల యస్సు 61 ఏళ్ల లేదా 33 సంవత్సరాల సర్వీస్ పూర్తయితే రిటైర్మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కొన్ని పత్రికలు, టీవీ చానళ్లలో వైరల్ అవుతున్నట్లు తెలిపారు. ఈ వార్తపై సాధారణ పరిపాలనా శాఖ, ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించగా తెలియదని చెప్పారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై వివరణ ఇవ్వాలని కోరారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న దాతలు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయానికి స్థానిక భక్తులు శుక్రవారం విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన చారుగుళ్ల సాంబశివరావు – సీతారత్నం జ్ఞాపకార్థం వారి కుమార్తె రేపాక రూపావతి, కుమారుడు రేపాక శ్రీనివాసరావు – ప్రియ దంపతులు అమ్మవారికి బంగారు బొట్టు, ముక్కుపుడక, కళ్లు, అన్నదానం నిమిత్తం రూ.1,00,116 చెక్కును ఆలయ సేవా సమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పచ్చిపులుసు వెంకటసుబ్బారావు, చారుగుళ్ల శ్రీనివాస్, వెంకటనాగభూషం, ఈగ రామచందర్‌రావు, నాగలక్ష్మి, చంద్రశేఖర్, కృష్ణ, కృష్ణార్జున్‌రావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి


నవ్య (ఫైల్)

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో పురుగుమందు సేవించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. నారాయణపురం గ్రామానికి చెందిన గూడూరు నవ్య (20) ఖమ్మంలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. కుటుంబ సభ్యులు నవ్యకు వివాహం చేయాలని సంబంధాలు చూస్తున్నారు. నవ్య తాను చదువుకోవాలని, ఇప్పట్లో పెళ్లి చేసుకోనని చెప్పినా కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాల్సిందేనని పట్టుబట్టడంతో మనస్తాపం చెంది గురువారం పురుగుమందు సేవించింది. ఆమెను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై దాడి

కామేపల్లి: పండితాపురం గ్రామంలోని బెల్ట్ షాపులపై ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపుల్లో మద్యం విక్రయిస్తున్న పరికపల్లి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మట్టి టిప్పర్లు సీజ్..

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి, కాచిరాజుగూడెం గ్రామాల్లో మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు జేసీబీలను, మూడు ట్రాక్టర్లను రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కొందరు వ్యక్తులు జేసీబీలు, ట్రాక్టర్లతో ప్రైవేట్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుతుండగా దాడి చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రామారావు తెలిపారు.

మట్టి ట్రాక్టర్లు, జేసీబీ..

అశ్వారావుపేట: అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో ఒక జేసీబీ, ఐదు మట్టి ట్రాక్టర్లను అశ్వారావుపేట పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మొద్దులగూడెం నుంచి అశ్వారావుపేటకు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా డయల్ 100కు స్థానికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో 5 ట్రాక్టర్లను, జేసీబీని అదుపులోకి తీసుకున్న పోలీసులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

బాలుడు అలా సేదతీరాడు..


చెట్టు నీడన సేద తీరుతున్న బాలుడు

అశ్వారావుపేట: అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట చెట్టుకింద శుక్రవారం ఓ బాలుడు ఎంచక్కా పక్క పరుచుకుని నిద్రించాడు. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఈ దృశ్యం పలువురికి బాధ కలిగించింది. ఏతప్పూ చేయని పసిపిల్లాడు తన బంధువులు పోలీస్ స్టేషన్‌కు రావడంతో వారితోపాటు వచ్చి ఇలా సేద తీరి ఉంటాడనుకుని జాలిపడ్డారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

ఎక్కడికక్కడే ఎన్నికల సామగ్రి

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు
- గతంతో పోలిస్తే నిబంధనల్లో మార్పు
- రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రం ఖమ్మంలోనే ఏర్పాటు



ఖమ్మంసహకారనగర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఖమ్మం పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ఉన్నాయి. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే పోలింగ్‌కు సంబంధించి ఉద్యోగులను అక్కడి అధికార యంత్రాంగమే నియమిస్తుంది. అయితే, ఎన్నికల సామగ్రిని గతంలో ఒకే చోట పంపిణీ చేయగా ఈసారి మాత్రం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేస్తున్నారు. కాగా, పోలింగ్ ముగిశాక సామగ్రి స్వీకరణ, లెక్కింపు కేంద్రం మాత్రం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుకు నిర్ణయించారు.

దూరభారం కాకుండా..

మే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుండగా.. పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని ముందుగానే అసెంబ్లీ నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుస్తారు. పోలింగ్‌కు ముందు రోజు ఆయా కేంద్రాల నుంచి ఉద్యోగులకు సామగ్రి అందజేస్తారు. ఇక ఓటింగ్ ముగిశాక అధికారులు, సిబ్బంది సామగ్రితో ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీ చైతన్య కళాశాలలోని కౌంటింగ్‌కు కేంద్రానికి చేర్చాల్సి ఉంటుంది.

గతంలో ఇలా...

అసెంబ్లీ ఎన్నికల్లో స్ట్రాంగ్ రూమ్‌ల వద్దే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఉండేవి. పోలింగ్‌కు ముందు రోజు అక్కడి నుంచే సామగ్రి తీసుకుని పోలింగ్ ముగిశాక తిరిగి అక్కడే అప్పగించేవారు. అనంతరం అన్ని నియోజకవర్గాల ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి చేర్చేవారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే విధానం అవలంబించేవారు.

ఇప్పుడు ఇలా..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం మార్పులు తీసుకొచ్చారు. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉద్యోగులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి సామగ్రి తీసుకుని నిర్దేశిత కేంద్రాలకు చేరుకోవాలి. పోలింగ్ ముగిశాక మాత్రం ఖమ్మంలోని రిసీవింగ్ సెంటర్‌కు ఈవీఎంలు, ఇతర సామగ్రిని చేర్చాల్సి ఉంటుంది. ఉదాహరణకు సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు ఆ నియోజకవర్గం స్ట్రాంగ్ రూం నుంచి సామగ్రి తీసుకుని నిర్దేశిత పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. పోలింగ్ పూర్తయ్యాక నేరుగా ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వివరాలు...

నియోజకవర్గం	డిస్ట్రిబ్యూషన్ కేంద్రం
ఖమ్మం, పాలేరు	శ్రీ చైతన్య కాలేజీ, పొన్నెకల్లు, ఖమ్మం రూరల్
మధిర	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఖాజీపురం
వైరా	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/కళాశాల
సత్తుపల్లి	జ్యోతినిలయం హైస్కూల్
కొత్తగూడెం	రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్ష్మీదేవిపల్లి
అశ్వారావుపేట	అగ్రికల్చర్ కళాశాల

రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రం అన్ని నియోజకవర్గాలకు కలిపి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య కళాశాలలో ఏర్పాటు చేశారు.

ఓటర్లను ఆలోచింపజేసేలా...



ఎపిక్‌కార్డుతో పాటు పంపిస్తున్న ఓటరు ప్రతిజ్ఞ

ఖమ్మం సహకారనగర్: ఓటర్లను ఆలోచింపచేసేలా ఎన్నికల సంఘం నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో ఓటర్లు నమోదైన వారికి కేవలం గుర్తింపు కార్డులు మాత్రం జారీ చేసేవారు. కానీ ఇప్పుడు ఓటు నమోదుపై కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో 18ఏళ్లు నిండిన వారంతా దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఫొటో గుర్తింపు కార్డులను పోస్టల్ శాఖ ద్వారా చేరవేస్తున్నారు. అయితే, కేవలం కార్డు మాత్రం కాక ఆ కవర్‌లో ఓటు నమోదు ఆవశ్యకత, ఓటు ఎలా వేయాలనే వివరిస్తూ రూపొందించిన కరపత్రాలు సైతం జత చేస్తున్నారు. అలాగే, హెల్ప్‌లైన్ నంబర్లు, ఓటరు జాబితాలో పేరు చూసుకునేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సైతం పొందుపర్చారు. ఇక లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇంకో అడుగు ముందుకేసిన ఎన్నికల సంఘం ఓటరు ప్రతిజ్ఞను కూడా పంపిస్తోంది. ఇందులో 'భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎలాంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము' అని ముద్రించారు. దీనికి తోడు 'మీ అభ్యర్థిని తెలివిగా ఎంపిక చేసుకోండి... నీతిగా ఓటు వేయండి.. జ్ఞానం కల ఓటరుగా ఉండండి... మీ ఓటు వేయటాన్ని ఎప్పుడు చేజారనివ్వకండి' అంటూ ముద్రించడం ఓటర్లను ఆలోచింపచేస్తోంది.

భయాందోళనలో గిరిజనులు..

- చంద్రాయపాలెం ఘటనలో 92కు చేరిన అరెస్ట్‌లు
- గిరిజనులకు పెరుగుతున్న మద్దతు..
- అటవీ భూముల రక్షణ కష్టమే..


చంద్రాయపాలెంలోని వివాదాస్పద భూమి


బుగ్గపాడులో గిరిజనులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు(ఫైల్)

సత్తుపల్లి: మండలంలోని చంద్రాయపాలెం సర్వే నంబర్ 343 నుంచి 359 వరకు విస్తరించి ఉన్న 400 హెక్టార్ల భూమి హక్కులపై వివాదం నివురుగప్పిన నిప్పులా రగులుతోంది. మార్చి 31న జరిగిన ఘటనపై గిరిజనులకు అనుకూలంగా విడుదల చేసిన ఓ వీడియో వైరల్‌గా మారటం చర్చనీయాంశమైంది. పోలీసులపై దాడి జరిగినప్పటి నుంచి అప్పటి వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. దాడి చేసిన వారిని గుర్తించి అరెస్ట్ చేస్తుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో ఎప్పుడు ఎవరిని అరెస్ట్ చేస్తారోననే భయం నెలకొంది. ఇప్పటివరకు నాలుగు విడతలుగా 92 మంది గిరిజనులను అరెస్ట్ చేశారు. వారిలో 54 మంది మహిళలు, 38 మంది పురుషులున్నారు. నలుగురు మైనర్లు దాడి చేసిన వారిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంకా ఎంత మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తారోనంటూ గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు.

135 ఎకరాలకు పట్టాలిచ్చి..

చంద్రాయపాలెనకు చెందిన 25 మంది గిరిజనులకు ఒక్కొక్కరికీ ఐదు ఎకరాల చొప్పున 135 ఎకరాలకు అటవీ హక్కుల చట్టం కింద పోడు పట్టాలిచ్చింది. 1970కి పూర్వం పట్టాలున్న రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, గాంధీనగరం గ్రామాలకు చెందిన గిరిజనులకు సర్వే నిర్వహించి పట్టాలివ్వాలని ఉద్యమిస్తున్నారు. అయితే, 400 హెక్టార్ల భూమి అటవీశాఖదేనని.. వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో జామాయిల్ పెంచామని వీటిపై ఎవరికీ హక్కులు లేవంటూ అటవీశాఖ వాదిస్తోంది. కాగా, సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్‌పై జరిగిన దాడి విషయంలో 92 మంది గిరిజనులపై కేసులు నమోదు చేయడంపై గిరిజన సంఘాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గిరిజనులపై దాడిని తీవ్రంగా ఖండించింది. పౌరహక్కుల సంఘం నేతలు ఆ ప్రాంతంలో పర్యటించి గిరిజనులపై పోలీసులు అమానుషంగా, విచక్షణా రహితంగా లాఠీచార్జ్ చేసి అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు.

జంకుతున్న అటవీ అధికారులు

చంద్రాయపాలెం ఘటనతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఆయుధాలు, ప్రత్యేక సిబ్బంది ఉన్న పోలీసులపైనే దాడి జరగటంతో ఆయుధాలు లేని తమపై దాడిని తిప్పికొట్టలేమంటూ అటవీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో అటవీశాఖ సిబ్బందిపై దాడి జరిగింది. అప్పటి నుంచి పోలీసుల సహకారం లేకుండా అటవీశాఖాధికారులు పోడు వివాదం జోలికి వెళ్లాలంటే జంకుతున్నారు. చంద్రాయపాలెం ఘటన అటవీశాఖకు పెద్ద తలనొప్పిలా మారింది.


చెబితే వినకపోతే..



నంబర్ ప్లేట్ లేని వాహనాలతో ఎవరూ తిరగొద్దంటూ పోలీసులు గత కొన్ని రోజులుగా హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ నగరంలో యువకులు నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్నారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలో తిరుగుతూ నంబర్ ప్లేట్ లేని, రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

రక్తంతో 'గుమ్మడి' చిత్ర పటం

అభిమానం చాటిన యువకుడు


వెంకటేశ్ నుంచి రక్తం సేకరిస్తున్న దృశ్యం


గుమ్మడి చిత్ర పటంతో పీడీఎస్‌యూ నేత

ఖమ్మం మయూరిసెంటర్/ఇల్లెందు : ప్రస్తుత రోజుల్లో సినీ హీరోలు, ప్రముఖ క్రికెటర్లకు వీరాభిమానులు ఉండడం చూస్తున్నాం. కానీ ఓ పాత తరం వ్యక్తి, అతి సామాన్యుడుగా జీవనం సాగిస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు గల ఈ వీరాభిమాని తన రక్తంతో గుమ్మడి చిత్రపటం గీయించి ఫ్రేమ్ కట్టించాడు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన ఒంగూరు వెంకటేశ్ పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఒక్కసారి ఎమ్మెల్యేగానో, ఎమ్మెల్సీగానో, ఎంపీగానో గెలిస్తే వేల కోట్లు వెనుకేసుకుంటున్న ఈ రోజుల్లో.. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నేటికీ అత్యంత సాధారణ జీవనం సాగిస్తూ, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేస్తున్న నర్సయ్యకు వీరాభిమానిగా మారాడు. అలాంటి నేత కోసం తన రక్తంతో చిత్ర పటం గీయించి ఆయన ఆదర్శాలను అందరికీ చాటిచెప్పాలని భావించినట్లు వెంకటేశ్ తెలిపాడు. ఖమ్మంలోని ఓ కళాశాలలో ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వెంకటేశ్.. రాజకీయాల్లో నిజాయితీపరులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఈనెల 20న ఖమ్మంలో సభ నిర్వహించి, తాను గీయించిన చిత్రపటాన్ని గుమ్మడి నర్సయ్యకు అందజేస్తానని చెప్పాడు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


వివరాలు సేకరిస్తున్న ఏఎస్ఐ కోడెత్రాచు

నేలకొండపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన చట్టు నాగరాజు (32) మృతదేహం గురువారం వ్యవసాయ బావిలో కనిపించింది. గ్రామానికి చెందిన నాగరాజు, అతని స్నేహితుడు పి.గోపి బుధవారం మద్యం సేవించేందుకు వ్యవసాయ బావి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. తరువాతి రోజు నుంచి నాగరాజు కనిపించలేదు. ఆరోజు ఏం జరిగిందనే విషయం కూడా గోపి ఎవరికీ చెప్పలేదు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలింపు చర్యలు చేపట్టారు. బంధువులు, స్నేహితులను వాకబు చేశారు. కానీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం స్థానిక వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే, దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు గోపిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆటోమొబైల్ షాపు దగ్ధం

సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం

పాల్వంచ: షార్ట్ సర్క్యూట్‌తో ఆటోమొబైల్ షాపు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బీసీఎంరోడ్‌లో అంబేడ్కర్ సెంటర్ వద్ద గల ఆటోమొబైల్ షాపులో శుక్రవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ జరి గి మంటలు లేచి, వస్తువులకు అంటుకున్నాయి. ఆటోమొబైల్ షాపు కావడంతో షాపులోని స్పేర్ పార్టులు, ఆయిల్, ఇతర విలువైన సామగ్రి దగ్ధమైంది. ఇంజన్ ఆయిల్ ప్యాకెట్లు ఉండటంతో మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. పక్క షాపుల నిర్వాహకులు సైతం భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న కొత్తగూడెం ఫైర్ ఇంజన్, కేటీపీఎస్ ఫైర్ ఇంజన్‌లు అక్కడికి చేరుకుని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ఎస్ఐ రాము ఘటనా స్థలాన్ని సందర్శించారు. కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ జి.పుల్లయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఎస్‌కె. సైదులు, శ్రీను, కార్తీక్, ప్రతాప్ పాల్గొన్నారు.

పలు చోరీల్లో నిందితుల అరెస్ట్

రూ.12 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు రికవరీ

అశ్వారావుపేటరూరల్: జాతర ఉత్సవాల్లో చోరీలకు పాల్పడిన ముఠాను శుక్రవారం అశ్వారావుపేట పోలీసులు అరెస్టు చేసి, నిందితుల వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురంలో ఇటీవల జరిగిన శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి తిరునాళ్లలో పలువురు భక్తులు, వ్యాపారుల దగ్గర గుర్తు తెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన వారు దర్యాప్తు చేపట్టారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన 13 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా, ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో చోరీలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి చోరీ చేసిన రూ.12 వేల నగదులోపాటు మరో 10 సెల్‌ఫోన్లను రికవరీ చేసి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, పట్టుబడిన 13 మందిని దమ్మపేట జ్యుడీషియల్ ప్రథమశ్రేణి కోర్టులో హాజరు పరిచారు.

పామాయిల్ చెట్లకు నిప్పు

రూ.5 లక్షలు ఆస్తి నష్టం

కొణిజర్ల: మొక్కజొన్న రైతు దంటుకు నిప్పంటించడంతో గాలులకు పక్కనే ఉన్న పామాయిల్ తోటకు నిప్పంటుకుని సుమారు 250 మొక్కలు కాలిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొండవనమాల గ్రామానికి చెందిన రైతు ఎం.విజయలక్ష్మి సుమారు 7 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పక్క చేను రైతు మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టగా అది పామాయిల్ తోటకు అంటుకుని సుమారు 250 మొక్కలు కాలిపోయాయి. పక్క రైతులు విషయాన్ని ఫైర్ ఇంజన్ సిబ్బందికి తెలపడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. శుక్రవారం బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొక్కలు కాలిపోవడం వల్ల రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేట (ములకలపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రాజమౌళి కథనం మేరకు.. మండలంలోని గుర్రాల కుంట ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఇసుక లోడుతో ఉన్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. క్వారీలో ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న మరో ఐదు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం


కాలిబూడిదైన వరిగడ్డివామి

ములకలపల్లి: మండలంలోని మాధారం గ్రామానికి చెందిన మైలగాని చంద్రమౌళికి చెందిన వరిగడ్డివామి అగ్నికి ఆహుతైంది. గురువారం అర్ధరాత్రి గడ్డివామికి నిప్పంటుకున్న విషయాన్ని గమనించి, స్థానికుల సాయంతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫైరింజన్ ఘటనాస్థలికి చేరుకొని, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రెండు ఎకరాలకు సంబంధించిన వరిగడ్డి కాలిపోయిందని, రూ.15 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు చంద్రమౌళి వాపోయారు. గ్రామానికి చెందిన మతిస్థితం లేని వ్యక్తి వల్లే ప్రమాదం సంభవించిందని అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలం పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం టౌన్ పోలీసులు పట్టుకున్నారు. టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని బ్యాగును పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ప్రశాంత్ మకాడియగా తేలింది. ఆయన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని, సుమారు రూ.3 లక్షల విలువ గల 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గోదావరిలో లభ్యమైన మృతదేహం

భద్రాచలం వాసిగా గుర్తింపు..?

బూర్గంపాడు: పాత గొమ్మూరు వద్ద గోదావరి ఒడ్డున ఐటీసీ వ్యర్థ జలాల్లో గురువారం లభ్యమైన మృతదేహం భద్రాచలానికి చెందిన వ్యక్తిదిగా తెలుస్తోంది. భద్రాచలానికి చెందిన ఓ పాల వ్యాపారి నాలుగురోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో గోదావరిలో లభ్యమైన మృతదేహంపై ఉన్న దుస్తుల ఆధారంగా భద్రాచలానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. ఈ విషయమై బూర్గంపాడు ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా మృతదేహంపై ఉన్న దుస్తుల ఆధారంగా మృతుడు భద్రాచలానికి చెందిన వ్యక్తిగా ప్రాథమిక అంచనాకు వచ్చామని తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టిన తరువాతనే మృతుడి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి గాయాలు

ఇల్లెందు: పట్టణంలోని 19వ వార్డు దాసరిగడ్డలో శుక్రవారం ఓ వివాహ నిశ్చితార్థ కార్యక్రమం సందర్భంగా భోజనాలు తయారు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వంట మనిషి గాయపడగా.. ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణం నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి

మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు సిద్ధం సభలో సీఎం జగన్



సభలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మోసాల చంద్రబాబు నుంచి మన రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో మీరంతా ప్రతి ఇంటికి వెళ్లి గత 58 నెలలుగా జరిగిన మంచిని వివరించాలి. ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవాలు వివరించి స్టార్ క్యాంపైనర్లుగా చేయాలి. ఈ మంచి కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ రావాలి.. మోసపోకూడదంటే మీ బిడ్డకే ఓటు పడాలి అని ప్రతి గడపకూ చెప్పాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గుంటూరు శివారు ఏటుకూరు వద్ద నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ..

ఈరోజు గుంటూరులో కనిపిస్తున్న ఈ మహా జన సముద్రం చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతుంది. మనందరి ప్రభుత్వానికి మద్దతుగా ఇప్పుడు జరుగుతున్న మంచిని కాపాడుకునేందుకు, ఆ మంచిని కొనసాగించేందుకు ఇక్కడి కి వచ్చిన ప్రతి అవ్వాతాత, సోదరులు, స్నేహితులకు చేతు లు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి గ్రామానికి పౌర సేవలు, విద్య, వైద్యం, రైతన్నలకు భరోసా, అక్క చెల్లెమ్మ లకు సాధికారత, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సేవలు అందించిన మన ప్రభుత్వానికి మద్దతు పలకడానికి మీరంతా సిద్ధమేనా? గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను ఒక్క రూపాయి కూడా లంచం, వివక్షకు తావు లేకుండా 130 సార్లు బటన్ నొక్కి పారదర్శకంగా నేరుగా అందించిన ఈ ప్రభుత్వానికి, మీ జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కేందుకు, మరో వంద మందికి చెప్పి నొక్కించడానికి మీరంతా సిద్ధమేనా?

రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు..

ఈ ఎన్నికల యుద్ధం కేవలం చంద్రబాబుకు, జగన్‌కు మధ్య జరుగుతున్నది కాదు. ఈ యుద్ధం చంద్రబాబు మోసాలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి, వాటిని ఆపిన బాబు దుర్మార్గాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది వారి మోసాలకు, మన విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఆ అబద్ధాల బాబుకు ఇద్దరు వంత పాడుతున్నారు. ఒకరు దత్తపుత్రుడు, మరొకరు ఆయన వదినమ్మ. ఈ ముగ్గురు కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు. 2014 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ నమ్మబలుకుతున్నారు.

మంచి కొనసాగాలో వద్దో ఆలోచించండి..

ఈ రోజు మీరంతా ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులతో కలసి ఒక్క అంశంపై ఆలోచన చేయమని కోరుతున్నా. మీ బిడ్డకు ఓటు వేయడం అంటే గత 58 నెలలుగా జరుగుతున్న మంచిని మీరందరూ కొనసాగించేందుకే ఓటు వేసినట్లే. మీ బిడ్డకు కాకుండా చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. ఈ 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని మీ అంతట మీరే మీకు వద్దని చెప్పినట్లేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నా. 58 నెలల క్రితం మీ బిడ్డ మీ అందరి ముందు నిలబడి ఫలానాది చేస్తానని ఎన్నికల మేనిఫెస్టో తీసుకొచ్చాడు. మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్ మాదిరిగా భావించి 99 శాతం హామీలను అమలు చేసి మీ ముందుకు వచ్చి మరోసారి ఆశీస్సులు కోరుతున్నాడు.

2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే..

ఒక్కసారి 2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. నాడు కూడా ఇదే కూటమి! మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలతో ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఇదే చంద్రబాబు సంతకం చేసి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో పాంప్లెట్లు ముద్రించి ప్రతి ఇంటికి పంపారు. మీరు మర్చిపోతారేమోననే భయంతో టీవీలలో, పేపర్లలో ఊదరగొట్టారు. చంద్రబాబు నాటి మోసాల్లో ఒక్కసారి ముఖ్యమైన వాటిని మీకు గుర్తు చేస్తా.

- ➤ రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా? ➤ పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా? ➤ ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మీకుగానీ, మీ ఇంటి చుట్టుపక్కల వారికిగానీ ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా? ➤ ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- ➤ అర్హులైన వారందరికి మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- ➤ రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి జరిగిందా?
- ➤ మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- ➤ సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. మరి జరిగిందా?
- ➤ ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి గుంటూరులో ఏమైనా కనిపిస్తోందా?

సెల్‌ఫోన్ లైట్లతో సంఘీభావం..

వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్ బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన ఆస్పత్రులు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి. 175కి 175 అసెంబ్లీ సీట్లు, 25కి 25 పార్లమెంట్ సీట్లలో ఏ ఒక్కటీ తగ్గకుండా గెలిపించేందుకు మీరు సిద్ధమేనా? పేదల భవిష్యత్తు బాగుండాలని చేస్తున్న ఈ యుద్ధానికి మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయాలి.

పాలకుడు మోసగాడైతే...

ఎలాంటి వారు రాజకీయ నాయకుడిగా ఉండాలి? ఎలాంటి వారిని మనం ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలన్న విషయంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. ఎందుకంటే మనం వేసే ఓటు ద్వారా రాబోయే ఐదేళ్ల జీవితం ఆ పాలకుడి చేతుల్లో పెడుతున్నాం. ఆ పాలకుడికి మంచి మనసు ఉండి మంచి చేస్తే మన జీవితాలు బాగుపడతాయి. ఆ పాలకుడు మోసగాడు అయితే మన బతుకులు అంధకారం అవుతాయి. పిల్లల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. అక్కచెల్లెమ్మల బతుకులు అతలాకుతలం అవుతాయి. రైతన్నల జీవితాలు మోసపోయి ఆత్మహత్యల పాలవుతాయి. అవ్వాతాతల సంక్షేమం అడుగంటిపోతుంది. అందుకే ఈ వాస్తవాలపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలని కోరుతున్నా. గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిలారు రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థులు నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, మురుగుడు లావణ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, విడదల రజని, అంబటి మురళీకృష్ణ, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మండపాటి శేషగిరిరావు, బత్తుల దేవానంద్ తదితరులు ఏటుకూరు సిద్ధం సభలో పాల్గొన్నారు.

తెలంగాణకు 8.5 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

గత అక్టోబర్‌లో చివరి సారిగా సమావేశమైంది. శ్రీశైలం ప్రాజెక్టు కనీస మట్టం (ఎండీడీఎల్)ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి రెండు జలాశయాల్లో 92.78 టీఎంసీలు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించింది. అయినప్పటికీ మే మాసాంతం వరకు మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలనే వినియోగించాలని అప్పట్లో కమిటీ నిర్ణయించింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాల కోసమని రిజర్వ్ చేసింది. మిగిలిన 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించిన విషయం విదితమే. కాగా కమిటీ నిర్ణయించిన కోటాకు మించి తెలంగాణ ఇప్పటికే 11 టీఎంసీలను వినియోగించుకుంది. ఏపీ కోటా మేరకు వినియోగించుకుంది. అయితే ఇరు రాష్ట్రాలు తాగునీటి అవసరాలకు అదనంగా జలాలను విడుదల చేయాలని బోర్డుకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలోనే కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంది. సమావేశంలో సాగర్ సీఈ అజయ్‌కుమార్, ఈఈ విజయ్‌భాస్కర్, కృష్ణా బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మంచినీటి కొరత ఎక్కువగా ఉంది: ఈఎన్సీ

త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం తాగునీటి అంశంపైనే చర్చించామని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి సమావేశానంతరం చెప్పారు. 2 రాష్ట్రాల అంగీకారంతో నీటి వాటాల పంపిణీ జరిగిందని తెలిపారు. ఏపీలో మంచినీటి కొరత కొంత ఎక్కువగా ఉందని వివరించారు.

'ఇంటర్' ద డ్రాగన్..

▶ మొదటి పేజీ తరువాయి



యాజమాన్యాలు చెప్తున్నాయి. కోవిడ్ సమయంలో కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారని, కొరత కారణంగా ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నాయి. నిర్వహణ భారం పెరిగిందని చెప్పుకొస్తున్నాయి.

అఫిలియేషన్ ఫీజు పెంచకున్నా..

రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు మూడు కేటగిరీల కింద అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇస్తుంది. ప్రతీ విద్యాసంస్థలో గరిష్టంగా 960 మందిని చేర్చుకునేందుకు అనుమతిస్తారు. అఫిలియేషన్ ఫీజు కింద ఏటా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలేజీల నుంచి రూ.1.20 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలోని కాలేజీల నుంచి రూ.60 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తారు. రెండేళ్లకోసారి ఈ ఫీజులను సమీక్షించి పెంచాల్సి ఉన్నా.. ఇంటర్ బోర్డు కొన్నేళ్లుగా పెంచలేదు.

50 శాతం దాకా పెంపు..

సాధారణ జూనియర్ కాలేజీల్లో గత ఏడాది వరకూ గరిష్టంగా రూ.60 వేల ఫీజు ఉంటే.. ఈసారి రూ.90 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. కార్పొరేట్ కాలేజీలు రూ.1.25 లక్షల నుంచి రూ. 2 లక్షలకుపైగా (కాలేజీని బట్టి) డిమాండ్ చేస్తున్నాయని.. అదే హాస్టల్‌నూ కలిపితే ఏకంగా రూ.3.25 లక్షల వరకు చెప్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఫీజులు పెంచడాన్ని చూసి.. సాధారణ కాలేజీలు కూ డా పెంచుతున్నాయని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల పరిధిలోనూ వార్షిక ఫీజులను రూ.75 వేల కు తక్కువ వసూలు చేయడం లేదని అంటున్నారు. మరో వైపు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కుల ధరలు కూడా గత ఏడాదితో పోల్చితే 20శాతం మేర పెరిగాయని.. ప్రైవేటు కాలేజీల రవాణా, ఆటో చార్జీలు కూడా 30శాతం వరకూ పెంచారని తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో ఇంటర్మీడియట్ విద్య కోసమే రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇంటర్ ఫీజుల తీరు ఇలా.. (రూ.లలో)

కాలేజీల తరహా	గత ఏడాది	ఈ సంవత్సరం
కార్పొరేట్ కాలేజీలు (డే స్కాలర్)	1.25 లక్షలు	2.25 లక్షలు
కార్పొరేట్ కాలేజీలు (విత్ హాస్టల్)	2.25 లక్షలు	3 నుంచి 3.25 లక్షలు
హైదరాబాద్‌లోని సాధారణ కాలేజీలు	75 వేలు	1.25 నుంచి 1.50 లక్షలు
సాధారణ కాలేజీలు (విత్ హాస్టల్)	1.25 లక్షలు	1.50 నుంచి 1.75 లక్షలు
మున్సిపాలిటీల్లో కాలేజీలు	60 వేలు	90 వేలు
మున్సిపాలిటీల్లో (విత్ హాస్టల్)	90 వేలు	1.25 లక్షలు
గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలు	40 వేలు	60 నుంచి 70 వేలు

అంత ఫీజు ఎలా కట్టగలం?

ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన మా అబ్బాయిని చేర్పించాలంటూ ఓ ప్రైవేటు కాలేజీ సిబ్బంది వెంటపడ్డారు. అడ్మిషన్ కోసం వెళ్తే ఏటా రూ.2.25 లక్షల ఫీజు అని చెప్పారు. కావాలంటే ఓ రూ.25 వేలు రాయితీ ఇస్తామన్నారు. అంత ఫీజేమిటని అడిగితే ఈ ఏడాది ఖర్చులు పెరిగాయని, అందుకే ఫీజులు పెంచామని చెప్పారు. రెండేళ్లకు రూ.4 లక్షల ఫీజు ఎలా కట్టగలం. వేరే కాలేజీల్లో ఆరా తీసినా అడ్డగోలుగా పెంచారు. ప్రభుత్వం నియంత్రణ చేపడితే పేదలకు ఊరటగా ఉంటుంది.
– సుచిత్ర, ఇంటర్ విద్యార్థి తల్లి, హైదరాబాద్

ఫీజుల నియంత్రణ అవసరం

కొన్ని కార్పొరేట్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు పెంచడం వల్ల అన్ని కాలేజీలూ ఆ నింద మోయాల్సి వస్తోంది. ప్రభుత్వమే కాలేజీలను కేటగిరీలుగా విభజించి, ఫీజుల నిర్ణయం చేయాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. పేదలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడానికి ఫీజుల కట్టడి చట్టాలు అవసరం.
– గౌరీ సతీశ్, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

కార్పొరేట్ ఆగడాలను అడ్డుకోరా?

అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తవకుండానే ప్రైవేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టడం చట్ట విరుద్ధం. దీనికితోడు పేదలు ఏమాత్రం భరించలేని విధంగా ఫీజులు పెంచడం దుర్మార్గం. పాలక వర్గాలు దీన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నాయి. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి.. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజు దోపిడీని అడ్డుకోవాలి.
– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దోపిడీని నియంత్రించకుంటే ఆందోళన

ప్రైవేటు కాలేజీల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సర్కారు నుంచి ఏ విధమైన ఆదేశాలూ లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. పేదలు భరించలేని విధంగా కాలేజీలు ఫీజులు పెంచుతున్నాయి. తక్షణమే నియంత్రణ చేపట్టాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.
– టి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

ఫిర్యాదులు వస్తున్నాయి.. పరిశీలిస్తున్నాం

ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల పెంపుపై అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. నియంత్రణ కోసం ఏం చేయాలనేది పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉంది.
– జయప్రదాబాయి, ఇంటర్ బోర్డ్ సీనియర్ అధికారి

జిల్లా వార్తలు

'రైతుబంధు' రుణాలకు ఆదరణ కరువు

- పంట తాకట్టుపై రూ.2 లక్షల వరకు రుణ సౌకర్యం
- ఖమ్మం జిల్లాకు రూ.13.80 కోట్ల నిధులు
- అయినా నలుగురికే రూ.7.60 లక్షల రుణం
- అవగాహన లేమితో నీరుగారుతున్న పథకం


రైతులు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం: లక్ష్యం గొప్పగా ఉన్నా అవగాహన రాహిత్యంతో మార్కెటింగ్ శాఖ రూపొందించిన రైతుబంధు పథకం ఆదరణకు నోచుకోవడం లేదు. రైతుల సంక్షేమం కోసం రూపొందించిన ఈ పథకానికి ప్రభుత్వం ప్రతి ఏటా నిధులు కేటాయిస్తోంది. ఈ ఏడాది ఖమ్మం జిల్లాకు రూ.13.80కోట్ల నిధులు మంజూరు చేయగా, కేవలం నలుగురు రైతులు రూ.7.60 లక్షలు మాత్రమే పొందారు. మిగిలిన నిధులన్నీ మార్కెటింగ్ శాఖ వద్దనే మూలుగుతున్నాయి తప్ప రైతులకు ప్రయోజనం కలిగించడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర లభించని సమయంలో రైతుల అవసరాలను తీర్చేందుకు ఆ పంటను తాకట్టు పెట్టుకొని రుణ సదుపాయం కల్పించేలా 'రైతుబంధు' పథకాన్ని రూపొందించి వ్యవసాయ మార్కెట్ల ద్వారా అమలు చేస్తున్నారు. ఈ పథకానికి ప్రతి ఏటా ప్రభుత్వం జిల్లాల వారీగా నిధులు మంజూరు చేస్తూనే ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యం అంతగా ప్రాచుర్యం పొందకపోవడంతో రైతులు వినియోగించుకోలేక పోతున్నారు.

రూ.2 లక్షల వరకు రుణ సౌకర్యం

మార్కెటింగ్ శాఖ నిర్వహణలో ఉన్న రైతుబంధు పథకం కింద పంట నిల్వ ఆధారంగా ఒక్కో రైతుకు రూ. 2 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటల ఆధారంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. రైతుబంధు రుణం తీసుకునే వారు తాము పండించిన పంటను గోదాముల్లో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి సంబంధిత ధ్రువ పత్రాలను ఆయా మార్కెట్ల అధికారులు సమర్పిస్తే, వారు పంట వివరాలను పరిశీలించి వాటికి గల ధరల ఆధారంగా 75 శాతం మేర రుణాలుగా చెల్లిస్తారు. ఈ విధంగా రూ. 2 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తారు.

నామమాత్రపు వడ్డీతో....

రైతుబంధు రుణాలకు వడ్డీ కూడా నామమాత్రంగానే నిర్దేశించారు. 180 రోజుల(6 నెలలు) వరకు ఎలాంటి వడ్డీ ఉండదు. 180 రోజుల నుంచి 270 రోజుల వరకు 12 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. 270 రోజుల్లో రుణం చెల్లించి పంటను తిరిగి తీసుకోవాలి. లేదంటే ఆ పంటను బహిరంగ వేలంలో విక్రయించి నిబంధనల మేరకు మార్కెటింగ్ శాఖ అప్పు జమ చేసుకునే అవకాశం ఉంది. ఇక నిల్వ చేసిన పంటకు బీమా సౌకర్యం కూడా ఉంటుంది.

వనరులున్నా.. ప్రయోజనం సున్నా

రైతుబంధు పథకానికి జిల్లాలో పుష్కలంగా వనరులున్నాయి. జిల్లాకు నీటి వనరులు ఉండటంతో వివిధ రకాల పంటలు పండుతున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీరు ఆధారంగా వరి ప్రధాన పంటగా సాగవుతోంది. వాణిజ్య పంటల్లో పత్తి, మిరప విస్తారంగా పండిస్తున్నారు. అపరాలు, ఉద్యాన పంటల సాగు కూడా జిల్లాలో అధికంగానే ఉంది. జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వానాకాలం, యాసంగి సీజన్లలో పండిస్తున్నారు. ఈ పంటల కొనుగోళ్లు, నిల్వలకు అనుగుణంగా ప్రభుత్వం, ప్రైవేటు ఏజెన్సీలు గోదాములు, కోల్డ్ స్టోరేజీలను నిర్మించాయి. ధాన్యం, మొక్కజొన్న, అపరాల వంటి పంటల నిల్వకు అవసరమైన గోదాములు ఉండగా, మిర్చి పంట నిల్వకు జిల్లాలో 44 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. గోదాములు, కోల్డ్ స్టోరేజీల్లో పంటలను నిల్వ చేసుకొని మార్కెటింగ్ శాఖ రూపొందించిన రైతుబంధు పథకాన్ని రైతులు వినియోగించుకునే అవకాశం ఉంది. కానీ మార్కెటింగ్ శాఖ పథకం పట్ల అవగాహన కల్పించక పోవటంతో రైతులు వినియోగించుకోలేక పోతున్నారు. 2013 నుంచి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తూ ధాన్యం వంటి పంటలకు రుణ సదుపాయాన్ని కల్పించారు. కరోనా కాలంలో మిర్చి పంటకు కూడా రైతుబంధు పథకాన్ని వర్తింపజేశారు. ఆ సమయంలో కొన్ని మార్కెట్లు రైతులకు ఈ రుణాలిచ్చినా.. ఆ తరువాత అందించిన దాఖలాలు లేవు.

కేవలం నలుగురికే...

ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రైతుబంధు పథకానికి రూ. 13.80 కోట్లు మంజూరు చేయగా, జిల్లాలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కేవలం నలుగురు రైతులకు మిర్చి పంట ఆధారంగా రూ. 7.60 లక్షలు మాత్రమే రుణాలిచ్చారు. ప్రస్తుతం మిర్చి ధర పతనమవుతున్న దశలో కూడా మార్కెటింగ్ శాఖ రైతుబంధును ప్రోత్సహించడం లేదు. ఇదిలా ఉండగా పలు కోల్డ్ స్టోరేజీలు హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టాయి. ఖాళీగా ఉన్న కోల్డ్ స్టోరేజీల్లో మిర్చిని నిల్వ పెట్టి రుణాలను అందించే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తే మేలు జరుగుతుంది. ఖమ్మం వంటి వ్యవసాయ మార్కెట్లకు కమిటీలు లేకపోవటం కూడా పథకానికి ప్రతిబంధకంగా చెప్పొచ్చు.

2013 నుంచి పథకం పొందిన రైతులు, రుణాలు

సంవత్సరం	రైతులు	రుణ మొత్తం (రూ.లక్షల్లో)
2013-14	25	17.90
2014-15	62	63.15
2015-16	103	100.45
2016-17	217	177.47
2017-18	234	254.07
2018-19	187	190.35
2019-20	189	200.68
2020-21 (కరోనా)	1,513	1,732.52
2021-22	91	142.56
2022-23	25	44.85
2023-24	4	7.60

ఆ పథకం ఏమిటో తెలియదు..



రైతుబంధు పథకం గురించే తెలియదు. ఈ ఏడాది రెండకరాల్లో మిర్చి సాగు చేశా. 30 క్వింటాళ్ల పంటను తక్కువ ధరతోనే విక్రయించా. వానాకాలం, యాసంగి సీజన్ల వరి సాగు చేశా. ధాన్యం కూడా ఎప్పటికప్పుడు కల్లాల్లోనే విక్రయిస్తున్నా. రైతుబంధు పథకం ఉందని తెలిస్తే మిర్చి కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసి రుణం తీసుకునేవాన్ని.
– నాగండ్ల వెంకటేశ్వర్లు, ఎద్దులచెరువు, తిరుమలాయపాలెం మండలం

వినియోగించుకునే అవకాశం ఉంది..



రైతులు పండించిన పంటలను గోదాంలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రైతుబంధు ద్వారా రుణం పొందే అవకాశం ఉంది. పంట ధర ఆధారంగా 75 శాతం రుణం ఇస్తాం. వ్యవసాయ మార్కెట్ల ద్వారా పథకాన్ని అమలు చేస్తున్నాం. గతంలో ధాన్యానికి వర్తింపజేయగా.. కరోనా తర్వాత మిర్చికి కూడా రుణం ఇస్తున్నాం.
– ఎం.ఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ముస్తాబవుతున్న పర్ణశాల


చాందినీ వస్త్రాలతో ముస్తాబైన పర్ణశాల రామాలయం

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మండలంలోని పర్ణశాల రామాలయంలో ఈ నెల 17న జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఆలయ, పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు పర్ణశాలకు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి సుందరంగా రంగులు వేశారు. ప్రధాన ఆలయం, గాలిగోపురం, ఉపాలయాలు, ప్రహరీ, పంచవటీ కుటీరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పంచవటీ కుటీరం గడ్డితో కప్పి అందంగా అలంకరించడంతో పాటు విగ్రహాలకు నూతన రంగులతో సుందరంగా తయారు చేశారు. కల్యాణం జరిగే మండపంతో పాటు దేవాలయం ప్రాంగణంలో చాందినీ వస్త్రాలతో ముస్తాబు చేస్తున్నారు. నవమి రోజున భద్రాచలం వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది పర్ణశాలకు కూడా వస్తుంటారు. దానికి అనుగుణంగా ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆలయంలో జరిగే శ్రీరామ కల్యాణ మహోత్సవానికి ఉభయ దాతల రుసుము రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఉభయ దాతల గోత్ర నామాలతో కల్యాణం నిర్వహించి వారికి స్వామివారి ప్రసాదంగా కండువా, జాకెట్ పీస్, పెద్దలడ్డూ, కల్యాణ అక్షింతలు అందజేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. భక్తులకు విక్రయించేందుకు దాదాపు 5 వేల లడ్డూలను భద్రాచలం దేవస్థానం నుంచి పర్ణశాలకు తీసుకొస్తున్నారు. భక్తులకు సరిపడా పులిహోర ప్రసాదం సిద్ధం చేయనున్నారు. పులిహోర 200గ్రా. రూ.15, లడ్డూ ధర రూ.25గా నిర్ణయించారు.

పంచాయతీ ఆధ్వర్యంలో...

శ్రీరామనవమికి పర్ణశాల పంచాయతీ ఆధ్వర్యంలో పనులను వేగవంతం చేశారు. రామాలయ ఆవరణలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించే మండపం చుట్టూ పారిశుద్ధ్య పనుల నిర్వహణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పర్ణశాల గ్రామంలోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి వాహనాలు పార్క్ చేసేందుకు అనువుగా స్థలాన్ని చదును చేస్తున్నారు. ఆలయ పరిసరాలను నాలుగు జోన్లుగా విభజించి మండలంలోని అన్ని జీపీలకు చెందిన 30 మంది కార్యదర్శులకు మూడు రోజుల పాటు విధులు కేటాయించారు. పారిశుద్ధ్య పనులకు 75 మంది కార్మికులను నియమిస్తున్నారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు ఆలయ పరిసరాలతో పాటు సీతమ్మ నార చీరల ప్రాంతంలో 4 తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.


విద్యుద్దీపాలతో...

సమన్వయంతో విజయవంతం చేస్తాం



కలెక్టర్ ఆదేశాల ప్రకారం శ్రీరామ నవమికి పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీరు, పారిశుద్ధ్య చర్యలతో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. గోదావరి తీర ప్రాంతంలో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేస్తున్నాం. దేవస్థానం, పంచాయతీ అధికారుల సమన్వయంతో నవమి వేడుకలను విజయవంతం చేస్తాం.
– ముత్యాలరావు, దుమ్ముగూడెం ఎంపీఓ

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



శ్రీరామనవమి సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నాం. పర్ణశాలకు వచ్చే ప్రతీ భక్తుడు స్వామి వారి కల్యాణం కనులారా తిలకించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కల్యాణం అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.
– అనిల్‌కుమార్, ఉత్సవాల ప్రత్యేకాధికారి

ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా బీమా పథకాల ఏజెంట్ల తాత్కాలిక నియామకానికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు పైబడిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు, గృహిణులు, అంగన్‌వాడీ, మహిళా మండళ్లు, పంచాయతీ సంచార కేంద్రాల సేవకులు, మాజీ సైనికోద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు అర్హులని వివరించారు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా చేయించేందుకు కమీషన్ పద్ధతిలో నియామకం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఎస్సెస్సీ మెమో, పాన్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను జతచేసి మే 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఖమ్మం-3 చిరునామాకు చేరేలా దరఖాస్తులను పంపించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు రూ. 5,000 విలువైన నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, కిసాన్ వికాస్ పత్రం రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు రేపు క్రీడాకారుల ఎంపిక

పాల్వంచరూరల్ : ఈనెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పాల్వంచలోని జిల్లా స్పోర్ట్ అథారిటీ మైదానంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు భద్రాద్రి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14, 16, 18, 20 సంవత్సరాల వయసు గల బాలబాలికలకు 100, 400, 800, 1,500, 5,000 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 99636 59598 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.